'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# సాగుకు చేదోడు అందించాలి

**ఓ పంట** చేతికందింది, మరో పంటకు ఉరకలేసే రోజుల్లో సంక్రాంతి పండుగ వస్తుంది. కానీ, ఈసారి పండుగ రోజులు రైతన్నకు అదురుపాటుతోనే గడిచాయి. ఓ వైపు వర్షాభావ పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. మరోవైపు కొత్తపంటకు నీళ్లివ్వలేమని కాంగ్రెస్ సర్కారు చేతులెత్తేస్తున్నది. దాంతో క్రాప్ హాలిడే అనే మాట తరచుగా చెవుల పడుతున్నది. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు రాకతో ఆయకట్టు పెరిగిన మన రాష్ట్రంలో ఈ పరిస్థితి తలెత్తడం ఆందోళనకరం. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా అంత మంచి విషయం కాదు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఒక్క ఎకరాకు నీళ్లు రావని అడ్డగోలుగా మాట్లాడిన కాంగ్రెస్ ఇప్పుడు అదే ప్రాజెక్టు బరాజ్‌లలో నీళ్లు లేవనే కారణంతో సాగునీరు విడుదల చేయలేమని అంటున్నది. రైతులు అర్థం చేసుకోవాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిస్సహాయత వ్యక్తం చేయడం గమనార్హం. ఇప్పటికే ప్రతిపాదించిన ఆయకట్టుకూ నీరివ్వలేమని అంటున్నారు. ఇది గోదావరి నీటి సంగతి. ఇక కృష్ణా బేసిన్‌లోనూ ప్రమాదఘంటికలు మోగుతున్నాయి. ఈ ఏడాది కృష్ణాకు ఆశించిన స్థాయిలో వరద రాలేదు. ఎగువన జూరాల మినహాయిస్తే దిగువన శ్రీశైలం, నాగార్జున సాగర్‌లలో నీరు లేదు. కర్ణాటకను అడిగి నీటిని తెప్పిస్తామని అంటున్నారు. కానీ, అక్కడా ప్రాజెక్టుల్లో నీరు అంతంతమాత్రంగానే ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి. ప్రభుత్వం సకాలంలో మేలుకొని స్పందించాలి.

ఇది సాకులు వెతికే సమయం కాదు. నెపం ఎవరి మీదనో, దేనిమీదనో తోసి పబ్బం గడుపుకొనే సమయం అసలేకాదు. సత్వరమే నీటి సరఫరాకు పటిష్ఠమైన చర్యలు చేపట్టి రైతన్నకు, ప్రజలకు భరోసా కల్పించాల్సిన తరుణమిది. స్వరాష్ట్ర సాధన తర్వాత పంట విస్తీర్ణం పెరిగింది. దిగుబడి ఇబ్బడి ముబ్బడి అయ్యింది. ఉచిత కరెంటు, దండిగా సాగునీరు, రైతుబంధు, రైతుబీమా వంటి మన వ్యవసాయ విధానాలు దేశానికే ఆదర్శంగా నిలిచిన సంగతి తెలిసిందే. వరి దిగుబడిలో పంజాబ్‌ను మన తెలంగాణ అధిగమించింది. అలాంటిది ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో వ్యవసాయం ప్రతిష్టంభన ఎదుర్కొంటున్నది. తెలంగాణ ప్రథమ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో బాగుపడిన సాగు మళ్లీ ఆగమాగమైపోతున్నట్టు కనిపిస్తున్నది. సాగునీరు ఇవ్వలేమంటున్నారు. కరెంటుకూ కోతలు తప్పడం లేదు. ఈ పరిస్థితి ఎక్కువ కాలం కొనసాగడం మంచిదికాదు. ప్రభుత్వం బరాజ్‌ల మరమ్మత్తులపై ప్రత్యేక దృష్టి సారించి సాగునీటి పారుదల మెరుగుపర్చేందుకు నడుం బిగించాలి. కరెంటు ఉత్పత్తిని, కొనుగోలును తగిన రీతిలో సమన్వయపర్చుకుని సరఫరాను సరిదిద్దాలి. మేలురకం విత్తనాలు, నాణ్యమైన ఎరువులు తగినంతగా రైతులకు అందుబాటులో ఉంచాలి. అంతకంటే ముందుగా పంట పెట్టుబడి సాయం రైతుబంధు, రుణమాఫీ గురించి కూడా ఆలోచించాలి. అన్నదాతకు అన్ని విధాలా అండగా నిలవడం ప్రభుత్వ తక్షణ కర్తవ్యం.




## వదంతుల వ్యాప్తే బీజేపీ పని!

ఢిల్లీ నుంచి గల్లీ వరకు బీజేపీ నేతలకు తెలిసిందొకటే.. అబద్ధాలు ప్రచారం చేయడం. కమలం పార్టీకి చెందిన జాతీయ నాయకులు వాట్సాప్ యూనివర్సిటీని తలపిస్తున్నారు. వాట్సాప్ యూనివర్సిటీ తరహాలో వదంతులు పుట్టిస్తున్నారు. అయోధ్య ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం లైవ్‌స్ట్రీమింగ్‌ను నిలిపివేశామనడం పచ్చి అబద్ధం.



**- ఎంకే స్టాలిన్,** తమిళనాడు ముఖ్యమంత్రి

# కాంగ్రెస్, బీజేపీ కక్ష బీఆర్‌ఎస్సే రక్ష



**తన్నీరు హరీశ్ రావు**
బీఆర్‌ఎస్ శాసనసభ్యులు

కొద్ది నెలల్లో జరగబోయే లోకసభ ఎన్నికలకు సంబంధించి తెలంగాణ కాంగ్రెస్, బీజేపీ నాయకులు కొన్ని రోజులుగా ఒకే రకమైన ప్రకటనలు చేస్తుండటాన్ని మనం గమనించవచ్చు. 'బీజేపీ గెలిస్తే నరేంద్రమోదీ ప్రధాని అవుతారు. కాంగ్రెస్ గెలిస్తే రాహుల్ గాంధీ ప్రధాని అవుతారు. బీఆర్‌ఎస్ గెలిస్తే కేసీఆర్ ప్రధాని కారు కదా? మరి బీఆర్‌ఎస్‌కు ఎందుకు ఓటెయ్యాలి? అసలు పార్లమెంట్ ఎన్నికలతో బీఆర్‌ఎస్‌కు ఏం సంబంధం?' ఇలా సాగుతున్నది ఆ రెండు పార్టీల నాయకుల వాదన. బీఆర్‌ఎస్ లాంటి ప్రాంతీయ శక్తులకు అసలు లోక్‌సభ ఎన్నికలతో ఏం పని? బీఆర్‌ఎస్ లోకస్ స్టాండి (లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే హక్కు/ అర్హత) ఏంటి? అని ప్రశ్నించే దాకా తెగింపు ప్రదర్శిస్తున్నాయి. పైకి చూస్తే ఇది నిజమే కదా? అనిపిస్తుంది. కానీ, ఆ ప్రకటనల, వాదనల లోగుట్టు చాలా వికృతమైనది. ఈ రెండు పార్టీలు ఒకే స్వరం వినిపించడం వెనుక కచ్చితంగా రహస్య ఎజెండా ఉన్నది.

> బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఒకే నాణానికి బొమ్మా బొరుసు లాంటివి. వారి నినాదాలు మాత్రమే వేరు, విధానాలు ఒకటే. జెండాలు మాత్రమే వేరు, ఎజెండా ఒకటే. బలహీనమైన రాష్ట్రాలు, బలమైన కేంద్రమే ఈ రెండు పార్టీల విధానం. రాష్ట్రాల హక్కులను కాలరాయడంలో రెండింటిదీ ఒకే దారి. ఉమ్మడి జాబితాలోని అంశాలను ఒక్కొక్కటిగా కేంద్రానికి బదిలీ చేసింది ఈ పార్టీలే. రాజ్యాంగ సంస్థల స్వయం ప్రతిపత్తిని కేంద్రప్రభుత్వానికి ధారాదత్తం చేసిన చరిత్ర ఈ పార్టీలదే. రాష్ట్రాలను నామమాత్రం చేయడమనే దీర్ఘకాలిక లక్ష్యానికి రెండు పార్టీలు జోడెద్దుల్లా పనిచేస్తున్నాయి.



రాష్ట్రాల్లో ప్రబల శక్తిగా ఉన్న పార్టీలను బలహీనపర్చడం లేదా కబళించడం ద్వారా దేశంలో రాష్ట్రాల ప్రాబల్యాన్ని తగ్గించాలనే ఎజెండా వారిది. సాధ్యమైనంత వరకు, అవకాశం ఉన్న మేరకు స్థానిక అస్తిత్వాలకు, రాష్ట్రాల హక్కులకు రక్షణ కవచంగా నిలబడే ప్రాంతీయ పార్టీలను బలి తీసుకుని ఆ పార్టీలు బలపడ్డాయి. ప్రాంతీయ పార్టీలు కేవలం శాసనసభ ఎన్నికల్లోనే పోటీ చేసే విధంగా, అదే జాతీయ పార్టీలు మాత్రం లోకసభ, అసెంబ్లీ రెండు చోట్లా పోటీ చేసే విధంగా చట్టం చేసే ఆలోచన కూడా ఆ రెండు పార్టీలకు ఉన్నది. అందుకు సరైన అదును కోసం ఎదురు చూస్తున్నాయి, అంతే. ఆ రహస్య ఎజెండా, భావసారూప్యత నేపథ్యంలోనే కాంగ్రెస్, బీజేపీ పార్లమెంట్‌లో ప్రాంతీయ పార్టీల ప్రాతినిధ్యాన్ని పరిమితం చేయాలని కుట్రలు చేస్తున్నాయి.

కాంగ్రెస్, బీజేపీ నాయకులు చేస్తున్న ప్రకటనలు, వాదనలు రాజ్యాంగ విరుద్ధమనే విషయాన్ని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. భారతదేశాన్ని రాష్ట్రాల సమాఖ్యగా మార్చడానికి ప్రత్యేక కారణం కూడా ఉన్నది. మన దేశం ప్రపంచంలోని మిగతా దేశాలకు చాలా భిన్నమైనది. భిన్నత్వంలో ఏకత్వమే భారతీయ ఆత్మ. ఎక్కడికక్కడ స్థానిక అస్తిత్వాలు బలంగా ఉన్న దేశమిది. అందుకే రాజ్యాంగ నిర్మాతలు భారతదేశం యూనిటరీ స్టేట్ (ఏకకేంద్ర దేశం)గా కాకుండా, యూనియన్ ఆఫ్ స్టేట్స్ (రాష్ట్రాల సమాఖ్య)గా ఉంటుందని రాజ్యాంగంలోని మొదటి ఆర్టికల్‌లోనే స్పష్టం చేశారు. రౌండ్ టేబుల్ సమావేశాలకు కూడా వివిధ సంస్థానాలు, మతాలు, కులాలకు చెందిన ప్రతినిధులు ప్రత్యేకంగా వెళ్లారే తప్ప, యావత్ భారతదేశ ప్రతినిధులుగా ఎవరూ వెళ్లలేదు. భారతదేశంలోని వివిధ రాష్ట్రాలు దేనికవే ప్రత్యేక రాజ్యాలుగా వెలుగొందిన చరిత్ర ఉన్నది. కాబట్టే భారతదేశం రాష్ట్రాల సమాఖ్యగానే ఉండాలని రాజ్యాంగసభలో తీర్మానించి అమలు పరిచారు. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలాగా యూనియన్ ఆఫ్ స్టేట్స్‌గా ఇండియా గొప్ప సమాఖ్య దేశంగా వర్ధిల్లుతుందని రాజ్యాంగ నిర్మాతలు ఆకాంక్షించారు. అమెరికా రాజ్యాంగంలోని ఫెడరల్ వ్యవస్థ కూర్పునే భారతదేశానికి కూడా అన్వయించారు. రాష్ట్రాల సమాఖ్యగానే కాకుండా, బహుళ రాజకీయ పక్షాలకు అవకాశం కల్పించే విస్తృత ప్రజాస్వామ్య వ్యవస్థను కూడా మన రాజ్యాంగం హామీ ఇచ్చింది. ఆయా రాష్ట్ర ప్రజలకు ప్రాతినిధ్యం వహించడానికి వీలుగా రాజకీయ పక్షాలు ఉండాలనే ఇలా నిర్ణయించారు. రాజ్యసభలో కూడా పార్టీల వారీగా ప్రతినిధులను కాకుండా, రాష్ట్రాల వారీగా ప్రతినిధులు ఉండే విధానం పెట్టారు. సెంట్రల్ గవర్నమెంట్ అనే పదమే రాజ్యాంగంలో వాడకున్నా, నేడు సెంట్రల్ గవర్నమెంట్ పేరుతోనే అంతా నడుస్తున్నది. బ్రిటిష్ కాలంలో గవర్నర్ జనరల్ పరిపాలనా యంత్రాంగాన్ని 'సెంట్రల్ గవర్నమెంట్'గా నిర్వచించేవారు. బ్రిటిష్ వాళ్లు పోతూపోతూ సెంట్రల్ గవర్నమెంట్ అనే వ్యవస్థనే రద్దు చేసిపోయారు. అధికార బదిలీ కోసం 1946లో తీసుకొచ్చిన క్యాబినెట్ మిషన్ ప్లాన్‌లో 'సెంట్రల్' అనే పదానికి బదులుగా యూనియన్ అనే పదాన్ని తొలిసారి ఉపయోగించారు. దీనిలో ఉన్న అనేక అంశాలను రాజ్యాంగ నిర్మాతలు పరిగణనలోకి తీసుకున్నారు. రాష్ట్రాల ఉనికిని, అస్తిత్వాన్ని, ప్రయోజనాలను కాపాడటానికి అనుగుణంగా రాజ్యాంగంలో చాలా స్పష్టంగా, కచ్చితమైన నిబంధనలను పొందుపరిచారు. రాజ్యాంగ నిర్మాతలు ఆశించింది ఒకటైతే 76 ఏండ్ల స్వతంత్ర భారతాన్ని ఎక్కువ కాలం ఏలిన కాంగ్రెస్, బీజేపీ చేస్తున్నది మరొకటి.

ఆ రెండు పార్టీలు రాష్ట్రాల ఉనికినే దెబ్బతీసే పనులు చేశాయి. రాష్ట్ర జాబితాలో ఉన్న చాలా అంశాలను కేంద్రం పరిధిలోకి మార్చాయి. ఉమ్మడి జాబితాలోని అంశాలపై రాష్ట్రాలతో సంప్రదించకుండానే నిర్ణయాలు తీసుకున్నాయి. యూనియన్ ఆఫ్ స్టేట్స్‌గా ఏర్పడిన దేశాన్ని యూనిటరీ స్టేట్‌గా మార్చింది ఈ పార్టీలే. బలమైన రాష్ట్రాలతో కూడిన అమెరికాలాగా భారతదేశం వర్ధిల్లుతుందని తొలితరం జాతీయ నాయకులు అనుకుంటే, కేంద్రాన్ని బలంగా తయారు చేసి అతలాకుతలమవుతున్న పాకిస్తాన్‌లాగా ఇప్పటి జాతీయ నాయకులు మన దేశాన్ని తయారు చేస్తున్నారు. చట్టాలు చేసుకునే హక్కు కలిగిన స్థాయి నుంచి రాష్ట్రాలను స్థానిక సంస్థలుగా మార్చే వ్యూహాన్ని జాతీయ పార్టీలు అమలు చేస్తున్నాయి. రాష్ట్రాలను నిర్వీర్యం చేయాలంటే, ముందుగా ఆయా రాష్ట్రాల్లో బలమైన స్థానిక నాయకత్వాలను దెబ్బతీయాలి. రాష్ట్రాల హక్కుల కోసం కొట్లాడే గొంతులను నొక్కేయాలి. ప్రాంతీయ పార్టీలు లేకుండా చేస్తేనే, కేంద్రం పెత్తనం మరింత సులువు అవుతుందనేది వారి ఎత్తుగడ.

ఈ వ్యూహంలో భాగంగానే మన దేశంలోని అనేక ప్రాంతీయ పార్టీలను బీజేపీ, కాంగ్రెస్ ఇప్పటికే మింగేశాయి. ప్రాంతీయ నాయకత్వాలు, పార్టీలు బలంగా ఉన్న రాష్ట్రాల్లో ప్రజలు ఎంత ఆత్మగౌరవంతో బతుకుతూ, తమ హక్కులు సాధించుకుంటున్నారో మనం చూస్తూనే ఉన్నాం. ఇందుకు తమిళనాడు చక్కని ఉదాహరణ. జాతీయ పార్టీలను వదిలించుకున్న తమిళ ప్రజలు ద్రవిడ పార్టీలనే నమ్ముకున్నారు. తన భాషను, తన సంస్కృతిని, తన హక్కులను ఆ రాష్ట్రం కాపాడుకోగలుగుతున్నది. ద్రవిడ ఉద్యమ స్ఫూర్తిని వందేండ్లయినా కానీ పోగొట్టుకోకుండా వారు ఉత్తరాది ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తూ, స్వీయ అస్తిత్వాన్ని చాటుకుంటున్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా 69 శాతం రిజర్వేషన్లు ఆ రాష్ట్రంలో అమలు చేసుకోగలుగుతున్నారు. ద్రవిడ పార్టీల స్థానంలో కాంగ్రెస్, బీజేపీ ఉంటే అది సాధ్యమయ్యేదా?

> తెలంగాణలో కూడా బలమైన ప్రాంతీయ పార్టీ ఉంది కాబట్టే ఏకంగా రాష్ట్రమే సాధించగలిగాం. రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేండ్లలో ఎన్నో పనులు సొంతంగా చేసుకోగలిగాం. రాష్ట్ర హక్కుల కోసం రాజీలేని పోరాటం చేయగలుగుతున్నాం. తెలంగాణలో బీఆర్‌ఎస్ లాంటి ప్రాంతీయ రాజకీయ శక్తే లేకుంటే ఇదంతా సాధ్యమయ్యేదా?

కావేరీ వివాదం తెరపైకి వస్తే, తమిళనాడు ప్రజలంతా పార్టీలకు అతీతంగా రాష్ట్రం కోసం మాట్లాడతారు.. మాట్లాడుతున్నారు.. పోట్లాడుతున్నారు. తెలంగాణలో అది సాధ్యమా? రేపు కృష్ణా జలాల వివాదం తలెత్తితే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఎవరి పక్షాన నిలుస్తాయి?

> మన రాష్ట్ర కాంగ్రెస్ అటు ఆంధ్రప్రదేశ్‌లోని తెలుగుదేశం, ఇటు కర్ణాటక కాంగ్రెస్‌ల చెప్పుచేతల్లో ఉంటుంది. వారికి వ్యతిరేకంగా తెలంగాణ కాంగ్రెస్ నేతలు మాట్లాడలేరు. ఢిల్లీకి ఎదురు చెప్పలేరు. జాతీయ పార్టీల కుట్రలకు బలై.. ప్రాంతీయ పార్టీలను, ప్రాంతీయ నాయకులను శక్తిహీనం చేసుకున్న ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, హర్యానా లాంటి రాష్ట్రాలు ఎన్ని ఇబ్బందులు పడుతున్నాయో చూస్తూనే ఉన్నాం. బీఆర్‌ఎస్ అనే కవచం లేకుంటే తెలంగాణ పరిస్థితి కూడా అంతే అవుతుంది.

బీఆర్‌ఎస్ ఒక్కసారి ఓడిపోగానే తెలంగాణ భావజాలానికి చీకటి ఛాయలు అలుముకోవడం ప్రారంభమైంది. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ నాయకుల వ్యవహారశైలిని, ప్రసంగాల తీరును గమనించండి. 'జై తెలంగాణ' అని మాటవరసకైనా వారు అనరు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జై తెలంగాణ అని నినదించడం నేను ఇప్పటిదాకా వినలేదు. బీజేపీ నాయకుల గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. వారి నోరు ఎన్నడూ 'జై తెలంగాణ' అని పలకదు. వారి నినాదాలు వేరు, వారి విధానాలు వేరు. పార్లమెంట్‌లో రాష్ట్రాల వారీగా కాకుండా, పార్టీల వారీగా సభ్యులకు మాట్లాడే అవకాశం ఉంటుంది. తెలంగాణ నుంచి ఎన్నికయ్యే కాంగ్రెస్, బీజేపీ సభ్యులు కూడా పార్టీ కోటా నుంచే మాట్లాడాలి. దేశవ్యాప్తంగా ఉన్న వారి ఎంపీలకు వచ్చే అవకాశంలో తెలంగాణ వారికి దక్కే చాన్స్ చాలా తక్కువ. వచ్చిన అవకాశంలో కూడా వారు పార్టీ లైన్‌లోనే మాట్లాడాల్సి ఉంటుంది. అధిష్ఠానం చెప్పిన సబ్జెక్ట్ మాత్రమే మాట్లాడాలి. కానీ, బీఆర్‌ఎస్ ఎంపీలకు తెలంగాణ ఎజెండా తప్ప మరొకటి ఉండదు. తెలంగాణ సమస్యలే ప్రస్తావిస్తారు. వాటి పరిష్కారం కోసం మాత్రమే కృషి చేస్తారు.. పోరాడతారు. అందుకే పార్లమెంట్‌లో బీఆర్‌ఎస్ ఎంపీలు ఎంత ఎక్కువ మంది ఉంటే, తెలంగాణకు అంత మేలు జరుగుతుంది.

> పార్లమెంట్‌లో రాష్ట్రాల వారీగా కాకుండా, పార్టీల వారీగా సభ్యులకు మాట్లాడే అవకాశం ఉంటుంది. తెలంగాణ నుంచి ఎన్నికయ్యే కాంగ్రెస్, బీజేపీ సభ్యులు కూడా పార్టీ కోటా నుంచే మాట్లాడాలి. దేశవ్యాప్తంగా ఉన్న వారి ఎంపీలకు వచ్చే అవకాశంలో తెలంగాణ వారికి దక్కే చాన్స్ చాలా తక్కువ. వచ్చిన అవకాశంలో కూడా వారు పార్టీ లైన్‌లోనే మాట్లాడాల్సి ఉంటుంది. అధిష్ఠానం చెప్పిన సబ్జెక్ట్ మాత్రమే మాట్లాడాలి. కానీ, బీఆర్‌ఎస్ ఎంపీలకు తెలంగాణ ఎజెండా తప్ప మరొకటి ఉండదు. తెలంగాణ సమస్యలే ప్రస్తావిస్తారు. వాటి పరిష్కారం కోసం మాత్రమే కృషి చేస్తారు.. పోరాడతారు. అందుకే పార్లమెంట్‌లో బీఆర్‌ఎస్ ఎంపీలు ఎంత ఎక్కువ మంది ఉంటే, తెలంగాణకు అంత మేలు కలుగుతుంది.

ప్రాంతీయ పార్టీల విషయంలో బీజేపీ, కాంగ్రెస్ తెలంగాణలో తీసుకున్న వైఖరే దేశమంతా తీసుకుంటాయా? అంటే అదీ లేదు. అందితే జుట్టు లేకుంటే కాళ్లు అనే చందం. 'పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఏం పని?' అని తెలంగాణలో ప్రశ్నించే బీజేపీ నాయకులు మహారాష్ట్రలో శివసేనను అదే ప్రశ్న అడగగలరా? తమిళనాడుకు వెళ్లే కాంగ్రెస్ నాయకులు ఢిల్లీలో ద్రవిడ పార్టీలకు ఏం పని? అని ప్రశ్నించగలరా? ఒక వైపు ప్రాంతీయ పార్టీల ఉనికిని దెబ్బతీస్తూనే మరోవైపు ప్రాంతీయ పార్టీల బలాన్ని వాడుకోవడానికి మాత్రం ఈ రెండు పార్టీలు ఏమాత్రం సంకోచించవు.

> బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏలో 34 భాగస్వామ్య పక్షాలుంటే, అందులో 33 ప్రాంతీయ పార్టీలే. కాంగ్రెస్ సమన్వయంలోని ఇండియా కూటమిలో 26 పక్షాలుంటే, అందులో 22 ప్రాంతీయ పార్టీలే. లోక్‌సభలో మొత్తం 39 పార్టీల ప్రతినిధులుంటే, అందులో జాతీయ పార్టీలు ఎనిమిది మాత్రమే. అంటే దేశంలో ప్రాంతీయ పార్టీల ప్రాబల్యాన్ని ఎంత దెబ్బతీయాలని చూసినా జాతీయ పార్టీలకు అది సాధ్యం కావట్లేదు. ఇటు రాష్ట్రాల్లో, అటు కేంద్రంలో నేటికి కూడా ప్రాంతీయ పార్టీలే బలంగా ఉన్నాయి. ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకోకుండా దేశంలో ఏ జాతీయపార్టీ కూడా ప్రస్థానం సాగించే పరిస్థితి లేదు.

స్థానిక కారణాల వల్ల ప్రాంతీయ పార్టీలకు ఆటుపోట్లు ఎదురవచ్చేమో కానీ, అంతిమంగా రాష్ట్రాల హక్కులను కాపాడే పార్టీలుగా, దేశ సమాఖ్య వ్యవస్థకు ఆయువుపట్టుగా ప్రజలు ప్రాంతీయ పార్టీలనే విశ్వసిస్తున్నారు. ఇది చరిత్ర చెప్పిన సత్యం.

టీఆర్‌ఎస్ పార్టీ పేరు మార్చుకుంది కాబట్టి, తెలంగాణతో ఏం సంబంధం? అని మరో వింత వాదనను కాంగ్రెస్, బీజేపీ నాయకులు ముందుకు తీసుకువస్తున్నారు. తెలంగాణ ప్రయోజనాల కోసం నిలబడే పార్టీ బీఆర్‌ఎస్ మాత్రమే అని ప్రజల గుండెల్లో ఉన్న ప్రగాఢమైన భావనను చెరిపేసే విఫల యత్నం చేస్తున్నారు. జాతీయ భావజాలంతో పనిచేయడం రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధమవుతుందా? జనసంఘ్ తన పేరును భారతీయ జనతా పార్టీగా మార్చుకుంటే, దాని మూల సిద్ధాంతమైన హిందుత్వకు తిలోదకాలు ఇచ్చినట్టా? ఇప్పటి ఏఐసీసీ ఒకప్పుడు రిక్విజిషన్ కాంగ్రెస్, ఆర్గనైజేషన్ కాంగ్రెస్, ఇందిరా కాంగ్రెస్‌గా కొనసాగలేదా? రకరకాల పేర్లు మార్చుకున్నది కాబట్టి దేశమంటే ప్రేమ లేదనుకోవాలా? పేర్లు మార్చుకుంటే విధానాలు మార్చుకున్నట్టా? తెలంగాణ అనే పదం పేరులో లేదు కాబట్టి, తెలంగాణ ప్రజల నుంచి బీఆర్‌ఎస్ వేరవుతుందా? ద్రవిడ అనే పదం శ్రీలంక, మలేషియా, సింగపూర్‌తో పాటు దక్షిణ భారతదేశానికి కలిపి వాడతారు. అంటే డీఎంకే, ఏఐఏడీఎంకే పార్టీల పేర్లలో తమిళ అనే పేరు లేదు కాబట్టి అవి తమిళ పార్టీలు కాకుండా పోతాయా? ఆప్ పార్టీ విస్తరించి, జాతీయ పార్టీ అయ్యింది. అంటే ఢిల్లీ ప్రయోజనాల పట్ల ఆప్‌కు పట్టింపు లేనట్టా?

> పేరు ఏదైనా కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ ప్రథమ ప్రాధాన్యం తెలంగాణ మాత్రమే. తమిళనాడు, బెంగాల్, ఒడిశా, బీహార్ తదితర రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణ ప్రజలు కూడా తమ రాజకీయ అస్తిత్వాన్ని పోగొట్టుకోరు. 23 ఏండ్ల రాజకీయ ప్రస్థానంలో, 10 ఏండ్ల అధికారంలో బీఆర్‌ఎస్ పార్టీ ఎప్పుడూ తెలంగాణ ప్రయోజనాల కోసమే నిలబడిందనే వాస్తవం కూడా ప్రజలకు తెలుసు. ప్రాంతీయ అస్తిత్వాలను దెబ్బతీయాలనే జాతీయ పార్టీల కుట్రలు తెలంగాణలో పనిచేయవు. ప్రాంతీయ పార్టీల మనుగడే దేశ సహకార సమాఖ్య విధానానికి పట్టుగొమ్మ.

# కాలయాపనకే కమిటీలు



**డా.బొల్లికొండ వీరేందర్**
98665 35807

> అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన బీజేపీ.. ప్రభుత్వం ఏర్పడి పదేండ్లు పూర్తవుతున్నా ఎన్నికల హామీని అమలు చేయకుండా చోద్యం చూస్తున్నది. దళిత వ్యతిరేక పార్టీగా పేరొందిన బీజేపీ తన వైఖరికి కొనసాగింపుగానే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత అంశాన్ని విస్మరించింది. ఎస్సీ వర్గీకరణ అంశాన్ని ఎన్నికల హామీగానే మిగిల్చి.. ఎస్సీ వర్గీకరణ ఉద్యమాన్ని నీరుగారుస్తున్నది.



తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా గతంలో అసెంబ్లీ వేదికగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. దాన్ని కేంద్రానికి పంపించి 10 ఏండ్లు పూర్తికావస్తున్నాయి. అయినప్పటికీ కేంద్రంలోని బీజేపీ సర్కార్ ఆ అంశాన్ని పరిశీలించకపోవడం శోచనీయం. ఎన్నికల సమయంలో మాదిగల ఓట్ల కోసం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు వర్గీకరణ అంశాన్ని తాత్కాలికంగా తెరమీదకు తీసుకొచ్చి లబ్ధిపొందుతున్నాయే కానీ, అమలుపై మాత్రం శ్రద్ధ చూపడం లేదు. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించకుండా గతంలో కాంగ్రెస్.. ఇప్పుడు బీజేపీ మాదిగలను మోసం చేస్తూ ఎస్సీ కులాల మధ్య మరింత దూరం పెంచేందుకు ఆజ్యం పోస్తున్నాయి. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి కోసమే ఎస్సీ వర్గీకరణపై కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబా నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గతంలో కాంగ్రెస్ చేసినట్టుగానే.. ఇప్పుడు బీజేపీ కూడా కమిటీలతో కాలయాపన చేస్తున్నది. గతంలోనూ జస్టిస్ రామచంద్రరాజు కమిషన్, ఉషా మెహ్రా కమిషన్ ఏర్పాటైన విషయం తెలిసిందే. వర్గీకరణపై బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే ఈ రెండు కమిటీల నివేదికల ఆధారంగా వర్గీకరణ చేపట్టవచ్చు కానీ, మోదీ ప్రభుత్వం అలా చేయడం లేదు.

జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అనేక సందర్భాల్లో చెప్పారు. కానీ, కేంద్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా దాన్ని విస్మరిస్తూ రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్నాయి. ఎస్సీల్లో విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక పరంగా వెనుకబడి ఉన్న మాదిగ కులం ఇతరులతో పోలిస్తే సమాన అవకాశాలు పొందలేకపోతున్నది. అందుకోసమే మాదిగల అభ్యున్నతే లక్ష్యంగా మాదిగ ఉద్యమం ప్రారంభమైంది. ఎన్నో ఏండ్ల ఉద్యమ ఫలితంగా ఎస్సీ వర్గీకరణ ఫలాలు జనాభా దామాషా ప్రకారం పొందుతున్న సమయంలో సుప్రీంకోర్టు కొన్ని సాంకేతిక సమస్యలను ప్రస్తావిస్తూ ఉమ్మడి రాష్ట్రంలో తెచ్చిన ఎస్సీ వర్గీకరణను కొట్టివేసింది. దీంతో వర్గీకరణ అంశం మళ్లీ మొదటికి వచ్చింది. 26 ఏండ్లుగా నలిగిపోతున్న ఈ అంశం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మళ్లీ తెరమీదకు వచ్చింది. తెలంగాణలో మొత్తం జనాభాలో ఎస్సీలు దాదాపు 16 శాతం ఉంటారు. వీరిలో 65-70 శాతం మంది మాదిగలే. ఇప్పటి జనాభా ప్రకారం శాస్త్రీయ పద్ధతిలో ఎస్సీ వర్గీకరణ జరగకపోతే తెలంగాణలోని మాదిగలకు తీవ్ర నష్టం జరుగుతుంది. తెలంగాణలో మాదిగలు 12 శాతం ఉంటారు. కాబట్టి వారి జనాభా తగినట్టుగా రిజర్వేషన్లు ఉండాలి. అప్పుడే సామాజిక న్యాయం జరుగుతుంది.

> కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీ లోపభూయిష్టంగా ఉన్నది. ఎందుకంటే ఈ కమిటీ.. ఏ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలో, ఎప్పటిలోపు నివేదిక ఇవ్వాలో స్పష్టత లేదు. తెలంగాణలో మాదిగల న్యాయమైన డిమాండ్‌ను గుర్తించిన ప్రథమ ముఖ్యమంత్రి కేసీఆర్ 2014 నవంబర్‌లో నాటి శాసనసభలో ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ పార్లమెంట్‌లో చట్ట సవరణ చేయాలని కోరుతూ ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపించారు. అప్పటి నుంచి వర్గీకరణ పట్ల తమ సానుకూలతను ప్రదర్శిస్తూనే ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ పట్ల కేసీఆర్‌కు సంపూర్ణ అవగాహన ఉన్నది. ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి ప్రభుత్వం వర్గీకరణపై ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీలో ఆయన సభ్యులుగా ఉన్నారు. జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు అమలు చేయాలని ఆ కమిటీ అభిప్రాయపడింది. అసెంబ్లీలో వర్గీకరణపై తీర్మానం చేసిన తర్వాత కేసీఆర్, ఆనాటి ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి 2016లో ప్రధాని నరేంద్ర మోదీని కలిసి ఎస్సీ వర్గీకరణపై పార్లమెంట్‌లో చట్టం చేయాలని కోరారు. ఉషా మెహ్రా కమిషన్ సిఫారసులను అమలు చేయాలని విన్నవించారు. వర్గీకరణ సమస్యను త్వరగా పరిష్కరించాలని కేంద్రానికి అనేకమార్లు తెలంగాణ ప్రభుత్వం తరపున లేఖలు కూడా రాశారు. గత రాష్ట్ర ప్రభుత్వ విన్నపాలను కేంద్రం బుట్టదాఖలు చేసింది.

కేసీఆర్ మరొక అడుగు ముందుకేసి ఎస్సీ వర్గీకరణకు సంబంధించి రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల( అఖిలపక్షం)కు అపాయింట్‌మెంట్ కావాలని ప్రధాని మోదీని కోరగా.. 2017 ఫిబ్రవరి 6న అపాయింట్‌మెంట్ ఇచ్చినట్టే ఇచ్చి రద్దు చేశారు. హైదరాబాద్‌లో జరిగిన గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్‌కు, మెట్రోరైల్ ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ వచ్చినప్పుడు కూడా అఖిలపక్షానికి సమయం ఇవ్వాలని కేసీఆర్ కోరారు. కానీ, ప్రధాని మోదీ తక్కువ సమయం ఉన్నదని చెప్తూ, కుదరదని తెగేసి చెప్పారు. ఈ విధంగా కేంద్రం వర్గీకరణతో దోబూచులాడుతున్నది. వర్గీకరణ పట్ల చిత్తశుద్ధితో ఉన్న కేసీఆర్ సర్కార్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోనని భావించి మాదిగ సమాజానికి బీజేపీ సర్కారు ద్రోహం చేసింది. 'వర్గీకరణను చేస్తాం' అని గల్లీ బీజేపీ నాయకులు, 'చేయడం కుదరదు' అని ఢిల్లీ నాయకులు మాట్లాడుతూ గందరగోళం సృష్టించారు. దీన్నిబట్టి వర్గీకరణ పట్ల బీజేపీ చిత్తశుద్ధి ఏపాటిదో యావత్ సమాజానికి అవగతం అవుతున్నది.

ఎస్సీ వర్గీకరణ అంశాన్ని నాటి కాంగ్రెస్, నేటి బీజేపీ ఓటు బ్యాంకు రాజకీయం కోసం వాడుకోగా.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాత్రం వర్గీకరణకు అనుకూలంగా అసెంబ్లీలో తీర్మానం చేసి తన చిత్తశుద్ధిని చాటుకోవటమే కాక నేటికీ సానుకూలంగా ఉన్నది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా అవకాశం వచ్చినప్పుడల్లా వర్గీకరణ అంశాన్ని బలపరుస్తూ మాదిగలకు భరోసానిస్తున్నారు. అయినా కేంద్రంలోని బీజేపీ సర్కారులో చలనం రావడం లేదు. బీజేపీ ప్రభుత్వం మాదిగల పట్ల తమ వైఖరిని మార్చుకొని వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి. లేకపోతే మాదిగల ముందు దోషిగా నిలబడకతప్పదు.

**వ్యాసకర్త: తెలంగాణ మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు**